క్లుప్తంగా

పార్టీ గెలుపు కోసం కష్టపడాలి




సీఎంతో జగదీశ్వర్‌రెడ్డి, రాజరత్నంరెడ్డి

పూతలపట్టు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కష్టపడి పనిచేయాలని మండల వైఎస్సార్ సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మేమంతా సిద్ధం–బస్సు యాత్రలో భాగంగా బుధవారం పూతలపట్టు మండలానికి విచ్చేసిన సీఎంను ఇరువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురికి పార్టీ గెలుపు దిశానిర్దేశాలను సూచించినట్లు తెలిపారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాణిపాకంలో ఛత్తీస్‌గఢ్ సీనియర్ ఐఏఎస్ అధికారి

కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని గురువారం ఛత్తీస్‌గఢ్ సీనియర్ ఐఏఎస్ అధికారి అన్బళగన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యాలయంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు 'పుస్తక' పఠనంపై శ్రద్ధ చూపాలి

బంగారుపాళెం: విద్యార్థులు వివిధ రకాల పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని తహసీల్దార్ సుభద్రమ్మ సూచించారు. అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం కుప్పాళ్లపల్లె బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యాన ఆశ్రమ నిర్వాహకులు 'శ్వాస విజ్ఞానజ్యోతి–విద్యార్థి జీవన క్రాంతి' అనే పుస్తకాలను ఉచితంగా అందజేశారు. వాటిని తహసీల్దార్, ఎంఈఓ నాగేశ్వర్‌రావు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, మంచి పుస్తకాలను చదవడం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ బాలాజీ, చిన్నయ్య, రోహిణిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

యాదమరి(పూతలపట్టు): జూదం ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ రవిశంకర్‌రెడ్డి కథనం మేరకు యాదమరి మండలం దళవాయిపల్లి పంచాయతీ పరిధిలోని మామిడితోటలో పేకాడుతున్న 9 మంది నిందితులను ఎస్‌ఐ రామాంజనేయులు అరెస్ట్ చేశారు. వారివద్ద నున్న రూ.2,07,370 నాలుగు మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నారు. 9 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మురుగేష్‌కు విజయానందరెడ్డి నివాళి



మురుగేష్‌కు నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: మండలంలోని చుక్కావారిపల్లెకు చెందిన మురుగేష్(80) గురువారం సచివాలయానికి వెళ్తుండగా మార్గమధ్యంలో సొమ్మసిల్లడంతో బండరాయిపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం తగలడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి చుక్కావారిపల్లెకు వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు పింఛన్లు ఇచ్చేవారని వాటిని అడ్డుకున్న చంద్రబాబునాయుడు వల్లే ఓ ప్రాణం బలైపోయిందన్నారు. మురుగేష్ కుటుంబాన్ని తాము అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఆయనతోపాటు ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, యువత అధ్యక్షుడు శిలంబరసన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయికృష్ణ, సూరి, త్యాగరాజులు నివాళులర్పించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పలమనేరు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలమనేరు ఎంఈఓ లీలాకుమారి అన్నారు.ఏపీ నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో స్థానికప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రతాప్, టీచర్లు పాల్గొన్నారు.

వృద్ధుల చావుకు కారణం చంద్రబాబే

- వాళ్ల ఉసురు టీడీపీకి తగులుతుంది
- వలంటీర్లను బెదిరిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నాయకులు గాయత్రీదేవి, జ్ఞానజగదీష్, రాహుల్‌రెడ్డి



మాట్లాడుతున్న గాయత్రీదేవి, జ్ఞానజగదీష్, రాహుల్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ''తెలవారకముందే ఇంటి వద్దే పింఛన్లు తీసుకున్న అవ్వా తాతలు నేడు ఎండలో పింఛన్ల కోసం వచ్చి కనుమూస్తున్నారు.. వారి చావుకు కారణం ముమ్మాటికీ చంద్రబాబే'' అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు గాయత్రీదేవి, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు పింఛన్లు తీసుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లపై టీడీపీ నాయకులు మొదటి నుంచి కక్ష కట్టారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి వాటికి అనుసంధానంగా వలంటీర్ల విధానాన్ని జగనన్న అమలు చేశారని స్పష్టం చేశారు. వలంటీర్ల ద్వారా గడప వద్దకే పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తుండడం చూసి టీడీపీ నాయకులు తట్టుకోలేకపోయారని చెప్పారు. దీంతో ఎలాగైనా వలంటీర్లను అడ్డుకోవాలన్న ఉద్దేశంతో అదును చూసి సరిగ్గా ఎన్నికల సమయంలో ఈసీకి ఫిర్యాదు చేసి, వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని ఆపించేశారని స్పష్టం చేశారు. తద్వారా రెండు రోజులుగా వృద్ధులు పడుతున్న బాధ వర్ణనాతీతంగా ఉందని వివరించారు. నగరంలో కొందరు టీడీపీ నాయకులు వలంటీర్ల మొబైల్‌కు ఓటీపీ పంపి డేటా చోరీకి యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలంటే తెలుగుదేశం నాయకులకు భయమెందుకని ప్రశ్నించారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న బాబు చిత్తూరుకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి చేస్తున్న కార్యక్రమాలను కాపీ కొట్టడమే టీడీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారన్నారు. గతంలో వారు చిత్తూరుకు చేసిన మేలు ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు ఇక్కడికి రావడం హడావుడి చేయడం ఓడిపోయాక వెళ్లి వ్యాపారాలు చేసుకోవడమే వారికి తెలుసన్నారు. అలాంటి వారు చిత్తూరును స్మార్ట్‌సిటీ చేస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసిన జగనన్న సీఎంగా, విజయానందరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. వలంటీర్ల పై కక్షకట్టిన వారికి పండుటాకుల ఉసురు తగులుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలు టీడీపీకు బుద్ధి చెబుతారని వివరించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము తదితరులు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామాపత్రం అందజేస్తున్న చెర్లోపల్లె వలంటీర్లు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో వలంటీర్లు రాజీనామా ప్రక్రియ గురువారం ఆరంభమైంది. చెర్లోపల్లిలో 15 మంది, తుమ్మిందలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ పత్రాన్ని వారు ఎంపీడీఓకు అందజేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తమను ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడంలో చిత్తశుద్ధితో పని చేశామన్నారు. కరోనా విపత్తులో కూడా ప్రజలకు సేవ చేయాలని ధైర్యంగా బయటకు వచ్చి తమవంతు సేవలు అందించామన్నారు. గత నాలుగున్నరేళ్లుగా తాము చేసిన సేవలు ప్రతిపక్షాలకు తెలిసినా నేడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలు చేస్తూ తమను ప్రజల నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల పింఛన్ డబ్బులు రాలేదేంటని పలువురు అడుగుతుంటే ఏం చెప్పాలో తెలియని పరిస్థితి అన్నారు. వృద్ధులు పెన్షన్ కోసం సచివాలయాలకు వెళ్లి ఇబ్బందులు పడుతుంటే చాలా బాధగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేసే వలంటీర్ వ్యవస్థపై రాజకీయ కుట్రలు చేయడం సరికాదని వారు మండిపడ్డారు.

ప్రచారంలో శబ్దం హద్దు మీరితే కేసులే !

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థు లు ప్రచారాల కోసం ప్రత్యేకంగా రూపొందించుకున్న పాటలను మైక్‌లలో మార్మోగిస్తుంటారు. ప్రజలకు అతిధ్వనులతో అసౌకర్యం కలగకుండా ఎన్నికల సంఘం పరిమితి విధించింది. హద్దు మీరి శబ్దం పెరిగితే కేసులు నమోదు చేస్తారు. శబ్దం ఏ ప్రాంతంలో ఎన్ని డెసిబెల్స్‌ను మించకుండా ఉండాలో ఎన్నికల నిబంధనలు వెల్లడిస్తున్నాయి. వీటిని ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ప్రాంతం	ధ్వనిస్థాయి (డెసిబెల్స్)
కాలనీలు, నివాస ప్రాంతాలు	45 నుంచి 55
విద్యాలయాలు, న్యాయస్థానాలు	40 నుంచి 50
వ్యాపార సముదాయాలు	55 నుంచి 65
పారిశ్రామిక ప్రాంతాలు	70 నుంచి 75

89 శాతం పింఛన్ల పంపిణీ



లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న సిబ్బంది

పూతలపట్టు: మండలంలో గురువారం నాటికి 89 శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేశారు. మండల పరిధిలోని 17 సచివాలయాల్లో వృద్ధులు పడిగాపులు గాశారు. ఎండ తీవ్రతతో సచివాలయాలకు వచ్చి పింఛన్ తీసుకోవడం కోసం నానా అవస్థలు పడ్డారు. ఇక దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులు ఎప్పుడెప్పుడు పింఛన్ ఇంటికి వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. మండలంలోని పోలవరం, పూతలపట్టు, పి.కొత్తకోట సచివాలయాల్లో ఫించన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రసన్నకుమారి పరిశీలించారు. వారు మాట్లాడుతూ నడవలేని, దివ్యాంగుల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నట్లు, మిగిలిన వారికి సచివాలయాల్లోనే అందిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఒక్కరోజే 89 శాతం వరకు పింఛన్ అందజేసినట్లు తెలిపారు.

8366 మందికి పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

తవణంపల్లె: మండలంలోని 17 సచివాలయాల్లో గురువారం పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరిగిందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో 9,878 పింఛన్లు మంజూరు కాగా రెండు రోజుల్లో 8,366 మందికి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారికి రాత్రుల్లో కూడా పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇంటికే పరిమితమైన లబ్ధిదారులకు వారి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తామని తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నట్లు తెలిపారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా రాజన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సీఆర్.రాజన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి రాజన్ బాధ్యతలు తీసుకున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవిరాజు

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు మరణాల కట్టడికి వైద్యసేవల్లో పలు మార్పులు తీసుకొచ్చిందని ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ రవిరాజు తెలిపారు. చిత్తూరు నగరంలోని డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో గురువారం మాతాశిశు మరణాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్యం అందించి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలని ఆదేశించారు. వైద్యాధికారులు మాతాశిశు మరణాలను నివారించేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి ప్రసవం అయ్యేంత వరకు గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ముఖ్యంగా హైరిస్క్ కేసులపై దృష్టిసారించాలని సూచించారు. వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవ సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో వైద్యాధికారులు ఉషశ్రీ, మీనా సయ్యద్, మమత, లత, జానకీరావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బాధితుల పట్ల పోలీసుల నిర్లక్ష్యం



న్యాయం చేయాలని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

బంగారుపాళెం: స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టేకుమంద గ్రామానికి చెందిన బాధితులు గురువారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని టేకుమంద గ్రామానికి చెందిన పురుషోత్తంకు, అదే గ్రామానికి చెందిన రమేష్ కుటుంబ సభ్యులకు మధ్య వ్యవసాయ బోరు విషయమై గొడవలు ఉన్నాయన్నారు. వ్యవసాయ బోరు విషయమై గత నెల 3వ తేదీ గొడవ జరిగిందన్నారు. రమేష్ కుటుంబ సభ్యులు పురుషోత్తంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. దాంతో పురుషోత్తంను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ పురుషోత్తం 10వ తేదీ మృతి చెందారని తెలిపారు. నెల రోజులు గడుస్తున్నా పురుషోత్తం మృతికి కారకులైన రమేష్ బంధువులపై పోలీసులు చర్యలు తీసుకోలేదని మృతుని కుటుంబ సభ్యులు వాపోయారు. సంబంధిత ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. ఈవిషయంపై స్థానిక సీఐ లక్ష్మయ్యను వివరణ కోరగా బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు. కేసుకు సంబంధించి అన్ని ఆధారాలు సేకరిస్తామన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సేవలు



జొన్నగురకలలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య



నలిశెట్టిపల్లెలో గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందిస్తున్నామని డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని నలిశెట్టిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ వినయ్‌కుమార్ 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. గర్భవతులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ప్రసవం సమయంలో 104, 108 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జొన్నగురకలలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని జొన్నగురకలలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు చేయించి మాత్రలు అందజేశారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేయించి ఐరన్‌మాత్రలు తప్పక వాడాలని సూచించారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారంతోపాటు తాజా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, వేదావతి, అన్నపూర్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు, డిఈఓలు విజయలక్ష్మి, రవి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

గుడిపాల: వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సంధ్య అన్నారు. మండలంలోని వసంతాపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సంధ్య 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జబసెల్వి, చంద్ర, విజయమ్మ, ఉమ, సుజిమ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యంగా ఉండొద్దు



నగరంలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ప్రజలకు నీటి సరఫరా విషయంలో అధికారులు ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను కమిషనర్ తనిఖీ చేశారు. మురుగునీటి కాలువల్లో పూడికలు తీయించాలని, అవసరమైన చోట్ల ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించాలని చెప్పారు. నాలుగో వార్డులో నీటి సరఫరా పనులను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అమినిటీ కార్యదర్శి జ్యోతికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జ్ ప్రజారోగ్యశాఖ అధికారి చిన్నయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, వార్డు కార్యదర్శులున్నారు.

జిల్లేడుపల్లెలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



జిల్లేడుపల్లె పాఠశాలలో సరస్వతి పూజలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలో జిల్లేడుపల్లెలో గురువారం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతిదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేశారు. ప్రభుత్వ బడులు అమ్మఒడి లాంటి వని అన్నారు. పేద విద్యార్థులు పైసా ఖర్చులేకుండా ఒకటో తరగతి నుంచి ఉన్నత విద్య వరకు చదువుకునే అవకాశం కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలోనే ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంగళపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జయకాంతన్, అరుణ్ శివప్రసాద్, మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, త్యాగరాజరెడ్డి పాల్గొన్నారు.

టైఫస్ జ్వరాల నియంత్రణపై సమీక్ష

చిత్తూరు రూరల్: టైఫస్ జ్వరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం ఆయన సబ్ యూనిట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో టైఫస్ జ్వరాల కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. అడవుల్లో ఉండే మైట్స్ అనే కీటకం ద్వారా ఈ టైఫస్ జ్వరం వ్యాపిస్తోందన్నారు. ప్రస్తుతం వ్యాపిస్తున్న జ్వరాల పట్ల అధికారులు అప్రమత్తమై ల్యాబ్ టెస్టులను విధిగా చేపట్టాలని సూచించారు. తద్వారా టైఫస్ జ్వరాల కేసులను నివారించగలమని చెప్పారు. అలాగే ఫ్రైడే డ్రైడేను యథావిధిగా కొనసాగించాలని ఆయన తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందాం



తాళంబేడులో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



జగన్ ఫొటో చూసి ఆశీర్వదిస్తున్న తాత, కరపత్రం ఇస్తున్న ఇందుమతి

చిత్తూరు రూరల్: గత ఐదేళ్లుగా ప్రజాభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాటు పడిందని, మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు కోరారు. చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీలో గురువారం జెడ్పీటీసీ, మండల నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటా అందజేసి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును వివరించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నట్టేట్ట ముంచిందన్నారు. అబద్ధపు హామీలతో అన్ని వర్గాల వారిని మోసం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల వారీగా సీఎం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ ఫలాలను అందించారన్నారు. మళ్లీ మనమంతా జగనన్నకు ఓటు వేసి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అమరనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు సంపత్, ధర్మారెడ్డి, కృష్ణారెడ్డి, చిన్నబ్బ, మురళీధర్‌రెడ్డి, కోదండరెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, దిలీప్, రంజన్, కుమార్, వేలుస్వామి, కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి తెలిపారు. స్థానిక గంగాసాగరం, అనుపల్లెలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జగనన్న నాడు ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చారని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి పార్టీని విజయపథంలో నడిపించాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని పొందలేని ఇల్లే లేదని, వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు పార్టీకి పట్టం కట్టేందుకు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. స్థానికంగా కరపత్రాలు ఇవ్వగా ఓ తాత జగన్ ఫొటో చూసి నా బిడ్డ చల్లగా ఉండాలని ఆశీర్వదించాడు. కార్యక్రమంలో నాయకులు అంజలిరెడ్డి, శిరీష్‌రెడ్డి, కార్పొరేటర్ శోభ, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు



డాక్టర్ సునీల్‌కుమార్

పూతలపట్టు: మేమంతా సిద్ధం– బస్సు యాత్రలో భాగంగా బుధవారం పూతలపట్టు మండలంలోని గోపాలపురంలో నిర్వహించిన సీఎం బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజలు, పార్టీ శ్రేణులకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. పాటూరు వద్ద నుంచి సభా ప్రాంగణం వరకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సీఎంకు ఘనస్వాగతం పలికినట్లు తెలిపారు. ఇదే మాదిరిగానే నాయకులు, కార్యకర్తలు రానున్న సార్వత్రిక ఎన్నికలలో కష్టపడి పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమని తెలిపారు. పంచాయతీల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు కలిసి వారి పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిని వివరించాలని సూచించారు. తద్వారా ప్రజలకు పార్టీపైన మరింత అవగాహన కల్పించాలని సూచించారు. చంద్రబాబు చేసిన నీచమైన రాజకీయానికి ఈరోజు వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందించలేకపోయారని తెలిపారు.